క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధికి నిరంతర కృషి



పెదకూరపాడు: 75 త్యాళ్ళూరు బిడ్డగా గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. కొత్తగా మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎంపికైన సాంబిరెడ్డిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పేరేంట్స్ కమిటీ సభ్యులు మంగళవారం సత్కరించారు. ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సాయంతో మార్కెట్ యార్డును ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కల్లి శ్రీనివాసరెడ్డి, పేరేంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం శాంత భూలక్ష్మి పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్‌బీఐ భవన శ్లాబ్

క్రోసూరు: క్రోసూరు ఎస్‌బీఐ బ్యాంకు కార్యాలయం భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో వినియోగదారులు, బ్యాంకు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మంగళవారం శ్లాబ్ పెచ్చులూడి పడగా సమయానికి అక్కడ ఎవరూ లేకపోవటంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్లు వినియోగదారులు చెబుతున్నారు. ఈ విషయమై బ్యాంకు మేనేజరు బాబును వివరణ కోరగా నిజమేనని, గతంలోనూ ఇదేవిధంగా శ్లాబ్ పెచ్చులూడి పడినట్లు తనకు తెలిసిందన్నారు. దీనిపై భవన నిర్వాహకుడిని అడగగా ఖాళీ చేయాలని చెప్పారని మేనేజరు వివరించారు. ఈవిషయాన్ని ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం



పెదకూరపాడు: తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దారు క్షమారాణి మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు నిర్మలా లక్ష్మీకుమారి, ఆర్ఐ దాసు, వీఆర్వో నరసింహారావు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు శ్రీనివాసరావు

అచ్చంపేట: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని చిగురుపాడులో మంగళవారం జరిగింది. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్‌రవీంద్ర కథనం ప్రకారం.. చిగురుపాడుకు చెందిన నల్లమేకల శ్రీనివాసరావు (48) సైకిల్‌పై పొలం వెళ్లాడు. కొద్దిసేపటికి భార్య కూడా నడుచుకుంటూ పొలం వెళ్తుండగా మార్గమధ్యలో శ్రీనివాసరావు పడి ఉండటంతో పెద్దగా కేకలు వేసింది. ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అప్పటికే శ్రీనివాసరావు మృతి చెంది ఉన్నాడు. తమ్ముడు సుబ్బారావుతో శ్రీనివాసరావుకు ఎన్నో రోజులుగా ఆస్తి గొడవలు ఉండటంతో అతడే చంపి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ పాల్ రవీంద్ర తెలిపారు.

పీహెచ్‌సీలో అధునాతన ల్యాబ్



అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధునాతన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌ను ప్రభుత్వం నియమించింది. డిజిటల్ పరికరాలను సరఫరా చేసింది. ల్యాబ్‌లో ఎర్బా బయో కెమిస్ట్రీ, యూరిన్ ఎనాలిసిస్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్ పరికరాలతో 21 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. గతంలో పరీక్షలన్నీ బయట చేయించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం పీహెచ్‌సీలో వైద్యుని కొరత ఉంది. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి వెళ్లాల్సి వస్తోంది. ఈ పీహెచ్‌సీకి కొత్తగా రూ.1.80 కోట్లతో నిర్మించిన భవనాన్ని వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే. కావలసిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

పుస్తక పఠనంతో మేధాశక్తి

కారెంపూడి: పుస్తక పఠనం వల్ల విద్యార్థులలో మేధాశక్తి పెంపొందుతుందని, ప్రతి విద్యార్థి బాగా చదువుకుంటే మేధావిగా తయారవుతారని ఎస్ఆర్ఐ వీపీ అధ్యక్షుడు పందిరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన ఎస్ఆర్ఐ వీపీ తరపున స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు ఉపయుక్తమైన 1,582 పుస్తకాలను మంగళవారం బహూకరించారు.

విద్యార్థులకు జావసత్వాలు

విద్యార్థులకు రాగిజావ పంపిణీ ప్రారంభం





సత్తెనపల్లి 23వ వార్డులో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు ; పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరులో.. ; పెదకూరపాడులో..



నకరికల్లులో..



ముప్పాళ్ల మండలం దమ్మాలపాడులో..



రాజుపాలెం జెడ్పీ పాఠశాలలో..



అమరావతి మండలం లింగాపురంలో..



అచ్చంపేట జెడ్పీ హైస్కూల్లో..



క్రోసూరు జెడ్పీపాఠశాలలో..

సత్తెనపల్లి/పెదకూరపాడు/నకరికల్లు/ముప్పాళ్ల/రాజుపాలెం/అచ్చంపేట/అమరావతి/క్రోసూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మంగళవారం నుంచి రాగిజావ పంపిణీని ప్రారంభించారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 19వ వార్డ్ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జాడ కలెభ, ప్రధానోపాధ్యాయుడు తెలగతోటి కోటేశ్వరరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ జహీర్ పాల్గొన్నారు.

- 12వ వార్డు వాల్మీకీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీని కౌన్సిలర్ లోక కళ్యాణి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి, వైఎస్సార్ సీపీ నాయకుడు లోక మాధవ, మహిళా పోలీస్ భవానికుమారి, ఎడ్యుకేషనల్ సెక్రెటరీ సుమ పాల్గొన్నారు.
- 24వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో (ఎస్.ఆర్.బి.ఎస్) విద్యార్థులకు రాగి జావ పంపిణీని పాఠశాల పీఎంసీ చైర్మన్, న్యాయవాది ఎం.ఏడుకొండలు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే బషీర్, ఉపాధ్యాయులు పి.సంధ్య, గుంటూరు మేరీ జ్యోతి పాల్గొన్నారు.
- 23వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(వైసీ)లో రాగిజావ పంపిణీని ఆ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ ప్రారంభించారు. బాలికోన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రోజారాణి, విజయ కమల, నల్లబోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- వావిలాలనగర్ ఎంపీపీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యురాలు నిత్య ప్రియదర్శిని ధర్మరాజు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, డీలర్ రవిచంద్రన్, స్వామినాథన్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.
- పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ మేకల పరిశుద్ధకుమారి, ఎంపీటీసీ అల్లం భవానీ, పాఠశాల పేరేంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శాంత భూలక్ష్మి పాల్గొన్నారు. పెదకూరపాడులో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏకుల ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు పాల్గొన్నారు.
- నకరికల్లు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ఆర్.సాయినవీన్ కుమార్ మాజీ సర్పంచ్ కంఠమనేని కోటయ్య, చట్టి అపయ్య, గాలి చంద్రయ్య, జంపని నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, గజ్జల బ్రహ్మారెడ్డి, బుజ్జి, ప్రధానోపాధ్యాయులు కట్టా కోటేశ్వరరావు, మేదరమెట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.
- ముప్పాళ్ళ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. దమ్మాలపాడు గ్రామంలోని రామాపురం ఎంపీపీఎస్‌లో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్ళంశివరామిరెడ్డి విద్యార్థులకు జావ అందించారు. ముప్పాళ్ళలోని జెడ్పీ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తులశ్రీనివాసరావు జావ పంపిణీ చేశారు. మాదల జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ సైదాలు పాల్గొన్నారు.
- రాజుపాలెం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీని ప్రారంభించారు. రాజుపాలెం, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, ఎంఈఓ మల్లికార్జునశర్మ, సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, సానికొమ్ము వెంకటసుబ్బమ్మశ్రీనివాసరెడ్డి జావను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- అమరావతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీని ప్రారంభించారు. లింగాపురం జెడ్పీ హైస్కూల్లో ఎంపీపీ మేకల హనుమంతరావు జావను అందించారు. అమరావతి ఉర్దూ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ విద్యార్థులకు రాగిజావ అందించారు.
- అచ్చంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీని అట్టహాసంగా ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ వి.రాజశేఖర్ చేతుల మీదుగా జావను అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. తాడువాయి పరిధిలోని సంగ్రతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ భూక్యా రజనీభాయ్, కృష్ణానాయక్ దంపతులు రాగిజావ పంపిణీచేశారు.
- క్రోసూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీని ప్రారంభించారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలా విద్యార్థులకు జావను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, ఎంఈవో ఏసురత్నం పాల్గొన్నారు.

తోడేళ్లన్నీ ఏకమైనా గెలుపు వైఎస్సార్ సీపీదే

- బాబు చంకనెక్కితే బలిపశువయ్యేది పవనే
- జలవనరుల శాఖ మంత్రి అంబటి



ఎస్టీ రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న మంత్రి అంబటి

రాజుపాలెం: చంద్రబాబు సీఎం కావాలనే తపత్రయంతో ఆయన చంకనెక్కితే బలిపశువయ్యేది పవన్ కళ్యాణేనని, అలాంటి వారిని ప్రజలు నమ్మాలా అని రాష్ట్ర జల వనరులశాఖామాత్యులు అంబటి రాంబాబు ప్రశ్నించారు. గణపవరంలో ఐదు గ్రామ సచివాలయ కన్వీనర్‌లకు, గృహసారథులకు, వలంటీర్లకు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన శిక్షణ తరగతుల్లో మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. తోడేళ్లన్నీ ఏకమై వచ్చినా విజయం వైఎస్సార్‌సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు. సత్తెనపల్లిలోనూ చాలామంది నాయకులు పుట్టుకొస్తున్నారని, ఎంతమంది వచ్చినా భయం లేదని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు ప్రతిపక్షాలకు కనపడడం లేదని విమర్శించారు. వాటి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ గన్నుపల్లి వెంకటరమణబుల్లిబాబు, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ నకరికల్లు, సత్తెనపల్లి మండల కన్వీనర్‌లు భవనం రాఘవరెడ్డి, రాయపాటి పురుషోత్తం, నక్కా శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జిలు రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కొణతం స్వాతీ, చిలకా జైపాల్ పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

ఉప్పలపాడు శివారు గ్రామాలైన లక్ష్మీపురం, చల్లాపల్లి తండాలకు చెందిన 25 మంది ఎస్టీ రైతులకు ఎస్టీ కార్పొరేషన్, ఉద్యానశాఖ సంయుక్తంగా 90 శాతం సబ్సిడీతో సమకూర్చిన వ్యవసాయ పరికరాలను మంత్రి అంబటి రాంబాబు అందించారు. వీటిల్లో పవర్‌టిల్లర్లను, తైవాన్ స్ప్రేయర్లు ఉన్నాయి. అనంతరం రాజుపాలెం, నకరికల్లు మండలాలకు కేటాయించిన వైఎస్సార్ సంచార పశువైద్య సేవా వాహనాన్ని మంత్రి అంబటి రాంబాబు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. పశువులు అనారోగ్యం బారిన పడినప్పుడు 1962కు కాల్ చేస్తే పశువైద్యసిబ్బంది వచ్చి సేవలందిస్తారని ఏడీ డాక్టర్ వీరయ్య తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ సరళ

అచ్చంపేట: బాల్య వివాహాలు సరికాదని, పిల్లలను బాగా చదివించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ సరళ సూచించారు. కోనూరు జెడ్పీ హైస్కూలులో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపద కాలంలో బాలికలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

పెదకూరపాడు: బాల్య వివాహాలతో అనర్థాలెన్నో ఉంటాయని ల్యాంప్ సంస్థ ప్రతినిధి కొండపల్లి వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని పాటిబండ్ల గ్రామంలోని ఆర్‌సీఎం ఉన్నత పాఠశాల, ముస్సాపురం గ్రామంలోని అంగన్‌వాడీ -1 సెంటర్‌లో మైథాయిస్ ఫౌండేషన్ సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, గృహ హింసంపై కిషోర బాలికలు, తల్లిదండ్రులు గృహిణులకు అవగాహన కల్పించారు. ల్యాంప్ సంస్థ ప్రతినిధి కొండపల్లి వెంకటేశ్వరరావు, శిక్షకులు షేక్ బాజి మాట్లాడుతూ ఆపద సమయంలో పోలీస్ టోల్ ఫ్రీ నంబర్లు, దిశ యాప్‌లను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, మహిళా పోలీసు పుష్ప హేమ, అంగన్‌వాడీ కార్యకర్త కాకిరాల సుబ్బమ్మ పాల్గొన్నారు.

వేదగాయత్రి పురోహిత సంఘ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: స్థానిక అచ్చంపేట రోడ్డులోని శివాలయంలో మంగళవారం వేద గాయత్రి పురోహిత సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. వేద గాయత్రీ పురోహిత సంఘ అధ్యక్షుడు కలవకొలను సీతారామ శాస్త్రి అధ్యక్షత వహించారు. సమావేశంలో సంఘ అభివృద్ధి కార్యాచరణ విషయంపై చర్చించారు. ఈ సంవత్సరం వేద గాయత్రి పురోహిత సంఘం తరపున సభ్యులందరికీ పంచాంగం, బ్యాగు, జపాలకు వాడుకునే ఆసనము అందించాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శోభారాణి



వైద్య సిబ్బంది పనితీరును సమీక్షిస్తున్న జిల్లా వైద్య అధికారి డాక్టర్ శోభరాణి

అమరావతి: గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శోభారాణి ఆశావర్కర్లను ఆదేశించారు. మంగళవారం అత్తలూరు పీహెచ్‌సీలో ఆశావర్కర్ల పనితీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్ఓ శోభారాణి మాట్లాడుతూ గర్భిణుల నమోదు ప్రక్రియ నూరుశాతం పూర్తిచేయాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలని పేర్కొన్నారు. కాన్పులన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయ వలస కూలీలను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

పెదకూరపాడు: క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పనితీరు మెరుగుపరుచుకోవాలని, మార్చినెలలో కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ శోభారాణి సూచించారు. మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఏఎన్‌ఎంలు, వైద్యశాలలో పనిచేసే స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టుల పనితీరును పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ ఎస్.ప్రియాంక, డాక్టర్ వెలుగొండారెడ్డి, సూపర్‌వైజర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



క్రోసూరు: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం, శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివరామయ్య, ఎంఈఓ ఏసురత్నం, పీహెచ్‌సీ వైద్యురాలు బాలఅంకమ్మబాయి పాల్గొని అవగాహన కల్పించారు. విద్య, ఆరోగ్యం, సాధించాల్సిన పురోగతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

జల సంరక్షణ అందరి బాధ్యత



సత్తెనపల్లి: నీటిని సంరక్షించడం అందరి బాధ్యతని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు, న్యాయవాది ఎం.ఏడుకొండలు చెప్పారు. ఈ నెల 22న అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు పట్టణంలోని 13, 14 వార్డు సచివాలయాల్లో సిబ్బందికి నీటి ప్రాధాన్యంపై మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏడుకొండలు మాట్లాడుతూ నీరు ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాలని, భావితరాల కోసం ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. నీటి వృథాను, నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. ప్యానల్ అడ్వకేట్ దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి సంరక్షణతోపాటు వేసవి కాలం పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఎక్కువ మంది ప్రజలకు అవగాహన కల్పించవచ్చని ఈ కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు. సదస్సులో వలంటీర్ షేక్ సుభాని, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలకు ఫర్నిచర్, ట్యాబ్‌లెట్ల వితరణ



ఫర్నిచర్ బహూకరిస్తున్న కొత్త రామకృష్ణ, పక్కన డాక్టర్ శ్రీధర్, నరేంద్ర

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు అవసరమైన రూ.20 వేల విలువ గల ఫర్నిచర్, రూ.50 వేలు విలువ గల మల్టీ విటమిన్ ట్యాబ్‌లెట్లు దాతల సహకారంతో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావుకు అందించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ వైద్యశాలలో సిబ్బంది పెరిగారని కావాల్సిన వసతులు సరిగా లేవని హాస్పిటల్ అభివృద్ధి కమిటీకి విన్నవించడంతో వెంటనే స్పందించి ఈ ఫర్నిచర్ అందించారని పేర్కొన్నారు. సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ క్రోసూరుకు చెందిన పులిపాటి కిరణ్ కుమార్ సహాయంతో బీరువాను, షేక్ మహమ్మద్ అలీ సహాయంతో కంప్యూటర్ టేబుల్ అందించినట్టు వెల్లడించారు. ఒక మిత్రుడి సాయంతో సుమారు రూ.50 వేల విలువైన మల్టీ విటమిన్ టాబ్లెట్లు కూడా అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిక్రింది వెంకట మల్లికార్జునరావు(మల్లి), డాక్టర్ రావి క్రింది శ్రీధర్, డాక్టర్ లక్ష్మణరావు, యుడీసీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువు పనుల పరిశీలన

విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని చింతల తండా, సుబ్బారెడ్డి పాలెం, కొత్తూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులలో భాగంగా జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు పనులను ఎంపీడీఓ వి.కోటేశ్వరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. ఏపీఓ నాగశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఏపీఆర్‌డీసీ విద్యార్థుల ప్రతిభ

విజయపురిసౌత్: ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని కేవీఎస్ కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజయపురిసౌత్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.శ్రీధర్, ఎంఎస్సీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.కార్తిక్ ప్రతిభ కనబరచడంతో నాగార్జునసాగర్ ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల 5వ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి అభినందించారు.